RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 67 | పేజీలు : 4 | మంగళవారం 8 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



చంద్రబాబు అపాయింట్‌మెంట్

కోరిన వివేకా కేసు అప్రూవర్ దస్తగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు అమరావతికి వచ్చిన దస్తగిరి

వైసీపీ ప్రభుత్వంలో బెదిరించిన అధికారులే ఇంకా వేధిస్తున్నారని ఆరోపణ

వివేకా హత్య కేసు, మనీలాండరింగ్‌పై సీఎంకు వివరాలు అందిస్తానని వెల్లడి



వాట్సప్ గవర్నెన్స, డిజిటల్ సేవలు..

పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక

ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన

175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం

టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అమరావతి

ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో - మిగతా 3లో

మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

- కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి
- తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్


హైదరాబాద్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్‌వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

- విజయనగరం వైసీపీలో కీలక పరిణామం
- వైసీపీని వీడిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను
- జగన్‌కు రాజీనామా లేఖ పంపిన వైనం
- విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి నుంచి వైదొలగిన చిన్న శ్రీను
- వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా

ఆరంభమే అదిరింది



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే రాజకీయ రగడ తీవ్రస్థాయికి

బీఆర్ఎస్ నేతల నల్లచొక్కాల నిరసన, ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు, స్పీకర్ గౌరవంపై వివాదం

హాట్‌టాపిక్‌గా కాంగ్రెస్-బీఆర్ఎస్ పరస్పర ఆరోపణలు

హైదరాబాద్

చట్టసభ ఏదైనా సమావేశమయ్యే ముందు బిజినెస్ అడ్వైజరీ కమిటీ- బీఏసీ మీట్ కంపల్సరీ. అన్ని పక్షాల లీడర్లూ కూర్చుని మాట్లాడి అజెండా ఫిక్స్ చేస్తారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి తాజా సమావేశాలకు సంబంధించి కూడా దీనికి మీటింగ్ జరిగింది. సభను ఎన్నిరోజులు నిర్వహించాలి? ఏయే అంశాలపై ఎంతెంత సమయం మాట్లాడాలి? అని క్లియర్‌కట్‌గా పేపర్‌పై రాసుకున్నారు. కానీ, ఇది జస్ట్ డ్రాఫ్ట్ మాత్రమే. సభ మొదలయ్యాక రియాలిటీ వేరేగా ఉంటుంది. అక్కడ జరగాల్సిన చర్చ కంటే, జరక్కూడదని రచ్చే ఎక్కువౌతుంది. మనం ఎన్నిసార్లు అసెంబ్లీ సమావేశాలు చూడ్లేదూ! కానీ, ట్విస్ట్ ఏంటంటే, రొటీన్ ట్రెండ్ కూడా ఈసారి బ్రేకైంది. ఐదురోజుల సమావేశంలో మాటల కంటే తంటాలే ఎక్కువని తేలిపోయింది. ఆ రేంజ్‌లో జరిగింది తొలిరోజు రగడ. తొలిరోజే బ్లాక్ మండే... దద్దరిల్లిన అసెంబ్లీ ఔట్‌సైడ్ బ్లాక్ టీషర్ట్ వేసుకుని, సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించి, అడ్డుకున్న పోలీసుల్ని ప్రతిఘటించబోయి అసెంబ్లీ గేటు బైట బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన కామెంట్లు.. సహజంగానే సెంటరాఫ్ కాంట్రవర్సీ అయ్యాయి.


బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం

తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం

కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్



ఉల్లి ఘాటు, చికెన్ జోరు..


ఆగస్టులో స్వల్పంగా పెరిగిన ఇంటి భోజనం ఖర్చు

గతేడాదితో పోలిస్తే 5 శాతం పెరిగిన నాన్-వెజ్ థాలీ ధర

ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే ప్రధాన కారణమని వెల్లడి

టమాటా, బంగాళాదుంప ధరలు తగ్గడంతో కొంత ఊరట

రానున్న 2-3 నెలలు ఉల్లి ధరలు అధికంగానే ఉంటాయని అంచనా



మంగళవారం 8 సెప్టెంబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

బరిలో... తొడ గొట్టి ప్రత్యర్థిని ఓడించిన..

శేఖరుని వీరత్వం.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో విజేతగా నిలిచిన...

సిఐ శేఖర్ ను అభినందించిన ఎస్పీ



గోరంట్ల సెప్టెంబర్ 08 సీమ వార్త సాయంత్రం.

ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో సత్తా చాటిన శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల సీఐ బోయ శేఖర్. కర్తవ్యం తో పాటు క్రీడల్లో సైతం తన సత్తా చాటి తొడ గొట్టి ప్రత్యర్థులను ఓడించి ఫైనల్ లో మెడల్ సాధించిన ఘనత గోరంట్ల సీఐ బోయ శేఖర్ కే దక్కింది. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ కబడి పోటీలో బోయ శేఖర్ ప్రత్యర్థులను చెడుగుడు ఆడించి విజేతగా నిలిచిన సంఘటన చోటుచేసుకుంది.రాష్ట్ర స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభ చూపిన గోరంట్ల సీఐ బోయ శేఖర్ ను శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.



సెంట్రల్ ఆఫీస్‌లో...

పరిటాల ఫ్యామిలీ సెంట్రాఫ్ అట్రాక్షన్..!!

....టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

....జిల్లా నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్

.....పొలిటికల్ కమ్యునికేషన్‌పై చర్చ - ఎల్ నినోపై అవగాహన








అర్హత ఉంటే చాలు... అందరికీ కొత్త పెన్షన్..!!


....ధర్మవరంలో నూతన పింఛన్ దరఖాస్తుల ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

....సచివాలయంలో దరఖాస్తుల పరిశీలన, ఇ-కేవైసీ నమోదు తీరు సమీక్ష

.....అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛన్ అందజేయాలని అధికారులకు ఆదేశం.







ధర్మవరం,సెప్టెంబర్,08: సీమ వార్త సాయంత్రం.

ధర్మవరం పట్టణ పరిధిలోని 15వ వార్డు, గాంధీనగర్ సచివాలయాన్ని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి వేరిఫికేషన్, దరఖాస్తుల ప్రస్తుత స్థితి మరియు ఇ-కేవైసీ ప్రక్రియలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని, అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడూ విడిపోకుండా పక్కాగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.దరఖాస్తుల వేరిఫికేషన్ మరియు ఈ కేవైసీ నమోదులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత సమయానికే అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు.సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు అందుబాటులో ఉంటూ, ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,స్థానిక సచివాలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడలో...మెడకు 17 మెడల్స్..!!

.....ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్, డ్యూటీ మీట్‌లో సత్తా చాటిన శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు..

....మొత్తం 17 పతకాలు సాధించిన జిల్లా పోలీసు క్రీడాకారులు..

.....పథకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్





పుట్టపర్తి సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం.

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, విట్ యూనివర్సిటీలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ మరియు డ్యూటీ మీట్లో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 17 పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన 23 మంది - మిగతా3లో

మాతృ మరణాల తగ్గింపులో.....

స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర.

.....మాతృ మరణాలు నివారించేందుకు ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలి .... అనంతపురంలో....జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.

అనంతపురం, సెప్టెంబర్ 08 : సీమ వార్త సాయంత్రం.





మాతృ మరణాలు తగ్గింపులో స్వస్తి, ఫాగ్సి, ఆదను లాంటి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి సహకరించడం వల్ల కాన్పు సందర్భంగా జరిగే మాతృ మరణాలు బాగా తగ్గిపోయాయని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యులకు, స్టాఫ్ నర్స్ లకు క్షేమకర కాన్పులు చేయడంపై శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో, ఆసుపత్రిలో ఎన్ని వసతులు ఉన్నా మాతృ సంరక్షణకు అవసరమైన సాంకేతికత లేకపోతే పరిపూర్ణత రాదని చెప్పారు. మాతృ మరణాలు - మిగతా3లో

గిరిజన వృద్ధురాలుపై బూతులతో రెచ్చిపోయిన.... చీరాల సి ఐ ను వెంటనే సస్పెండ్ చేయాలి.

డిమాండ్ చేసిన రాష్ట్ర గిరిజన నేత, గోరంట జడ్పిటిసి పాలే జయరాం నాయక్.



గోరంట్ల సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. చీరాల ఆదినారాయణపురం కు చెందిన గిరిజన 70 సంవత్సరాల వృద్ధురాలు మహిళలపై అతి ఘోరంగా మాట్లాడడమే కాకుండా. లాఠీ ఎత్తుకొని కొట్టడానికి కూడా ప్రయత్నం చేయడమైనది. జాలమ్మ అనే వృద్ధురాలు పై జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ చీరాల సి ఐ నీ వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర గిరిజన నేత, గోరంట్ల జడ్పిటిసి పాలే జయరాం నాయక్ డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో రెండున్నర సంవత్సరం నుండి, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, జరుగుతూనే ఉన్నాయని , ఈ విధంగా నోటికి వచ్చినట్లు మాట్లాడడం, పద్ధతి కాదు అని గిరిజన సంఘం నాయకులు, హెచ్చరించడం జరిగింది. సి ఐ సస్పెండ్ చేయకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పాలే జయరాం నాయక్ హెచ్చరించారు.

టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్‌లో....
.జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు



మడకశిర సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్ లో టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ , మంత్రులు, ఎంపీలు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెస్ రాజు మంగళవారం పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి, ప్రజాసేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యునికేషన్?పై నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు. ఎల్ నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, నాయకత్వ సామర్థ్యం పెంపుపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సమష్టి కార్యాచరణపై చంద్రబాబు టిడిపి లీడర్స్ కు పలు కీలక సూచనలు చేశారు.

టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో
కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని
--పార్టీ బలోపేతం.. సమర్థవంతమైన పాలనపై కీలక చర్చలు





కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 8 సీమవార్త సాయంకాలం: తెలుగుదేశం పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంతో పాటు క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు ఉత్సాహభరితంగా కొనసాగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. సహచర ప్రజాప్రతినిధులతో కలిసి కాంక్లేవ్‌కు హాజరైన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పార్టీ నాయకత్వం, సంస్థాగత బలోపేతం, ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవం.. లోకేష్ యువ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల పాత్రను మరింత క్రియాశీలం చేయడం, ప్రభుత్వ అభివృద్ధి--సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంపై కాంక్లేవ్‌లో ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి అంశాలపై ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. పార్టీ అధిష్ఠానం నిర్వహించిన కీలక నాయకత్వ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎముకలగుట్టపల్లిలో.... లక్ష్మీ ఆదినారాయణ స్వామి 8 వ వారి వార్షికోత్సవ వేడుకలు.



గోరంట్ల సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ ఎముకల గుట్టపల్లి గ్రామంలో ఈసారి 8వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది గ్రామస్తుల ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి పూజలో జరుగుతున్నాయి నేడు చివరి రోజు సందర్భంగా గుడికి విచ్చేసిన భక్తాదులకు అందరికీ దేవుడు దర్శనం చేపించి అలాగే విచ్చేసిన అందరికీ అన్నదాన కార్యక్రమం గ్రామస్తులు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎముకల గుట్టపల్లి గ్రామస్తులు అందరూ పాల్గొనడం జరిగింది

వెంకట్రాంరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు.

.....టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటరామిరెడ్డి మృతి బాధాకరం

....భౌతికదేహానికి నివాళులర్పించిన...మంత్రి సవిత.





రొద్దం సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. రొద్దం మండలం గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. వెంకటరామిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న మంత్రి సవిత గోనిమేకలపల్లి గ్రామానికి వెళ్లి ఆయన భౌతికదేహానికి తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకటరామిరెడ్డి గారి కుటుంబ సభ్యులను మంత్రి సవితమ్మ పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వెంకటరామిరెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి సవితమ్మ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రొద్దం మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఉల్లి ఘాటు, చికెన్ జోరు..

సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై ధరల భారం మరోసారి పెరిగింది. ఆగస్టు నెలలో గృహావసర భోజనం ఖర్చులు స్వల్పంగా పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'క్రిసిల్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఉల్లిపాయలు, వంట నూనెలు, బ్రాయిలర్ చికెన్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. క్రిసిల్ 'రోటీ రైస్ రేట్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే శాకాహార భోజనం (వెజ్ థాలీ) ధర 1 శాతం పెరిగి రూ. 29.5కి చేరింది. అదే సమయంలో, మాంసాహార భోజనం (నాన్-వెజ్ థాలీ) ధర 5 శాతం పెరిగి రూ. 57.5కు చేరింది. అయితే, జూలై నెలతో పోల్చితే నాన్-వెజ్ థాలీ ధర 1 శాతం తగ్గడం గమనార్హం. ఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా ఉల్లి ధరలు ఏకంగా 43 శాతం మేర పెరగడమే ముఖ్య కారణం. మార్చి-ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లు వానల ప్రభావంతో సరఫరా తగ్గి ఉల్లి ధర కిలోకు రూ. 40కి చేరింది. వీటికి తోడు వంట నూనెల ధరలు 11 శాతం, ఎల్‌పీజీ ధరలు 10 శాతం, బ్రాయిలర్ చికెన్ ధరలు 10 శాతం మేర పెరిగాయి. నాన్-వెజ్ థాలీ ప్రియం కావడంలో చికెన్ ధరల పెరుగుదల కీలక పాత్ర పోషించింది. మరోవైపు బంగాళాదుంపల ధరలు 12 శాతం, టమాటా ధరలు 28 శాతం మేర తగ్గడంతో వెజ్ థాలీ ధరలు మరింత పెరగకుండా కొంతమేర అదుపులో ఉన్నాయి. ఇక జూలై నెలతో పోలిస్తే, శ్రావణ మాసం కారణంగా చికెన్ వినియోగం తగ్గి బ్రాయిలర్ ధరలు 4 శాతం మేర క్షీణించాయి. దీంతో నాన్-వెజ్ థాలీ ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది.

సెంట్రల్ ఆఫీస్‌లో...
పరిటాల ఫ్యామిలీ సెంట్రాఫ్ అట్రాక్షన్..!!

అనంతపురం డెస్క్ సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 2వ రోజు టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు-అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడం వంటి పలు ముఖ్యమైన అంశాలపై అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేష్ దిశా నిర్దేశ్యం చేశారు. సుస్థిర అభివృద్ధి, ప్రజాసేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యునికేషన్?పై చర్చ - ఎల్ నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. అధినేత చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం పెంపుపై దిశానిర్దేశం చేశారు. అలాగే సమష్టి కార్యాచరణపై సూచనలు చేశారు.

మాతృ మరణాల తగ్గింపులో..... స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర.

-మొదటిపేజీ తరువాయి

ఎక్కువగా కాన్పు సందర్భంలో జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామస్థాయిలో కూడా ఆరోగ్య సిబ్బందికి మాతృ ఆరోగ్య సంరక్షణకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం అందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు మానవతా దృక్పథంతో, సేవాభావంతో అందిస్తున్నట్లు చెప్పారు. స్వస్తి తమ శిక్షణ సేవలు ప్రైవేట్ రంగానికి, ఆర్డిటి లాంటి స్వచ్ఛంద సంస్థలకు కూడా అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా.కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్యులు తమ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వస్తి సాంకేతిక నిపుణులు డా.నాగేంద్ర, ట్రైనింగ్ టీం లీడర్ డా.స్టెఫీ, జిల్లా సమన్వయకర్త విజయ్ కుమార్, ఫ్యాగ్స్ సంస్థ శిక్షకులు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ హర్షిత, జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడలో...మెడకు 17 మెడల్స్..!!

-మొదటిపేజీ తరువాయి

పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ క్రీడాంశాల్లో పాల్గొని 3 బంగారు, 3 వెండి, 11 కాంస్య పతకాలు సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, కోకో, యోగా, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం, 4ఐ400 మీటర్ల రిలే తదితర క్రీడాంశాల్లో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, తమ చాంబర్‌లో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను అభినందించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ గారు తెలిపారు.జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.అనంతరం అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన ఐపీఎస్ గారు తన చాంబర్లో కలిసిన క్రీడాకారులను అభినందించారు.
పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు:
గోరంట్ల సీఐ శేఖర్ -- కబడ్డీలో కాంస్య పతకం.
ఏఆర్ ఆర్ఎస్ఐ వీరన్న -- క్రికెట్, కోకోలో , వెండి,కాంస్య పతకం. సంజీవ రాయుడు, మురళీమోహన్, సంజప్ప, రాంప్రసాద్, ఈశ్వర్, వీరానాయక్ -- కోకో పోటీలలో కాంస్య పతకాలు. గోవిందు -- ఫుట్‌బాల్‌లో కాంస్య పతకం. ప్రసాద్ 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం పోటీలలో బంగారు పతకాలు.
పద్మశ్రీ -- పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బ్యాడ్మింటన్‌లో వెండి పతకం, 4ఐ400 మీటర్ల రిలేలో వెండి పతకం.మంజమ్మ యోగాలో వెండి, కాంస్య పతకాలు సాధించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శేఖర్, శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ వీరన్న, పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

విజయవాడకు చేరిన తాడిపత్రి
సీలింగ్ ల్యాండ్ పంచాయతీ
దళిత రైతుకు జరిగిన అన్యాయంపై ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు - అండగా ఎమ్మార్పీఎస్



తాడిపత్రి, సెప్టెంబర్ 8 సాయంత్రం: తాడిపత్రి మండలం రావి వెంకటంపల్లి గ్రామానికి చెందిన వై.కుళ్లాయప్పకు జరిగిన భూ అన్యాయం చివరకు విజయవాడకు చేరింది. మంగళవారం విజయవాడలోని ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ని బాధితుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. 1976లో కుళ్లాయప్పకు పెద్ద పోడమల గ్రామ సర్వే నెం.1303లో 2.33 ఎకరాలు సీలింగ్ ల్యాండ్ కింద పట్టా మంజూరైంది. ఎర్రగుంటపల్లికి చెందిన లక్కం ఓబులమ్మ తన కూతురు బుసగాని లక్ష్మి పేరుతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకుందని, 6 ఏళ్లుగా తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు తిరిగినా న్యాయం జరగలేదని, తాడిపత్రి తహసీల్దార్ ఆఫీసులో ప్రశ్నించినందుకు అనంతపురం ఆర్డీఓ దుర్భాషలాడి అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడికి న్యాయం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పి.రాజారత్నం, ఎంపీ పుల్లయ్య, బాధితుడు వై.కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీకి కృషి చేస్తాం

మడకశిర సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంకాలం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి , ఆదేశాలతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశాలతో డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆదేశాలతో నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం గుడిబండ పంచాయతీలో కూటమి ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పెన్షన్ పరిశీలన మరియు లబ్ధిదారులకు సూచనలు సలహాలు అప్లికేషన్ వెరిఫికేషన్ పరిశీలించి వారికి చేదోడువాతోడుగా ఉన్న గుడిబండ యూనిటీ ఇన్చార్జి జనార్ధన్. ఈ సందర్భంగా అర్హులందరికీ అప్లై చేయడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

సీమ వార్త సాయంకాలం
మంగళవారం
8 సెప్టెంబర్ 2026

బెస్ట్ యూనివర్సిటీలో.... విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.

....పురుగులు పడిన భోజనం అందిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పిడిఎస్ యు మరియు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల డిమాండ్.



గోరంట్ల సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. బెస్ట్ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇమాన్యుల్ ని కలిసి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు బాబావాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ.. యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యత లేని, పురుగులు పడిన భోజనం అందిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడే విధంగా హాస్టల్ మెస్ నిర్వహణ కొనసాగడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రస్తుత మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు.అదే విధంగా ఫీజుల బకాయిలు లేదా ఇతర ఆర్థిక కారణాలతో ఏ విద్యార్థినీ పరీక్షలకు దూరం చేయకుండా, ప్రతి విద్యార్థికి యూనివర్సిటీలో అన్ని రకాల పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల విషయంలో ఎలాంటి ఆంక్షలు విధించకూడదని స్పష్టం చేశారు.
యూనివర్సిటీ విద్యార్థులకు రక్షణ కల్పించే విధంగా యూనివర్సిటీ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని, యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందు విద్యార్థులు, సిబ్బంది, ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం సరైన రక్షణ గోడ లేకపోవడం వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు.విద్యార్థుల సమస్యలను యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే సంబంధిత సమస్యలపై చర్యలు తీసుకుని పరిష్కరించాలని పిడిఎస్ యు , ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గాలి బద్రీనాథ్ హర్ష వర్ధన్ తదితరులు పాల్గొన్నారు

భూ రక్షణ కోసమే ఈ సర్వే.

వడిగే పల్లి రెవిన్యూ పొలంలో 800 ఈ సర్వే బుక్కులు పంపిణీ.

టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, తాసిల్దార్ మధు నాయక చేతుల మీదుగా రైతులకు పంపిణీ.





గోరంట్ల సెప్టెంబర్ 9 సీమ వార్త సాయంత్రం. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి అభిప్రాయపడ్డారు.
మండలంలోని వడిగేపల్లి రెవెన్యూ పొలం నందు పూర్తి అయింది. 800 పట్టాదారు పుస్తకాలు మంజూరు కాగా నేడు గోరంట్ల మండల తహసీల్దార్ మధు నాయక్ మరియు గోరంట్ల మండల టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణ చౌదరి ,రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సోమశేఖర్,జిల్లా కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పట్టాదారు పాసుబుక్ లు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, గోరంట్ల టౌన్ 6మ్యాన్ కమిటీ సభ్యులు నిమ్మల శ్రీధర్, పంచాయితీ అధ్యక్షులు ఆదినారాయణ, మాజీ సర్పంచ్ నరసింహామూర్తి, హరీష్ రెడ్డి,స్టోర్ డీలర్ చంద్రశేఖర్,అంజి,నరసింహామూర్తి,యూనిట్ ఇంచార్జ్,సింగిల్ విండో డైరెక్టర్ సాలెప్ప, స్టోర్ డీలర్ రవి, మాజీ ఎంపీటీసీ చంద్ర నాయక్, వెంకటేష్, రామాంజినేయులు, వెంకటరెడ్డి,బూత్ ఇంచార్జ్ వెంకటేష్ రెడ్డి,రాము, చంద్ర,రామాంజనేయులు,రెవిన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, రైతులు కూటమి నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు...

ఎంపిడిఓ రామనాయక్....




తనకల్లు, సెప్టెంబర్ 8 సీమవార్త (సాయంకాలం)న్యూస్.... గౌరవ శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశానుసారం గ్రామాలలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తనకల్లు మండలం మండల పరిధిలోని స్థానిక పరిషత్ కార్యాలయం లో ఎంపిడిఓ , ఖ. రామ నాయక్ గారు, ఆర్ డబల్యూ .యస్ .జె ఈ , మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో కూటమి నాయకులు మరియు పంచాయతీ కార్యదర్శుల సమన్వయం తో తాగు నీటి సమస్య రాకుండా ఒకవేళ వచ్చినా కూడా ఎప్పటికప్పుడు ఆయా గ్రామాలలోనే సమస్యను పరిష్కరించే దిశగా ఈ సమావేశం లో చర్చించడం జరిగింది. అందులో భాగంగా వివిధ పంచాయతీలలో ఇప్పటికే కొన్ని గ్రామాలలో నీటి సరఫరా చేస్తున్నటువంటి విషయాన్ని చర్చిస్తూ భవిష్యత్తు లో ఇలాంటి పరిస్థితులు మరిన్ని గ్రామాలలో వచ్చే పరిస్తితి ఉన్నందున తక్షణ చర్యలు తీసుకునే విధంగా ఎంపిడిఓ పంచాయతీ కార్యదర్శులుకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీ లోని మన నాయకులు కార్యకర్తలు ఎప్పటికప్పుడు నీటి సమస్య ఉన్నటువంటి గ్రామాలను గుర్తించి నీటి సమస్యను పరిష్కరించుటలో జాప్యం చేయరాదని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లో సంబంధిత అధికారులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

పెన్షన్‌కు సెల్ఫ్ డిక్లరేషన్ తో అర్హత ఇవ్వాలి



సోమందేపల్లి సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎన్డీయే కూటమి ప్రభుత్వం నూతన పెన్షన్ల అయిన డప్పు,చర్మ,చేనేత మరియు గీత కార్మికులకు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా దరఖాస్తు చేయడానికి అర్హత ఇవ్వాలని కోరుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటలక్ష్మమ్మ కు అర్జీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దండోరా బహుజన దళిత సంఘాల నాయకులు సూర్యనారాయణ కిష్టప్ప,నరసింహులు,రంగేపల్లి నాగరాజు, ఆంజనేయులు, కొల్లప్ప,సంజయ్,పెయింటర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి రోజు కనుకగా...
వృద్ధులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ



గోరంట్ల సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంత్రం. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని శ్రీ మారెమ్మ దేవి ఆలయ సన్నిధిలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతపురానికి చెందిన బాబయ్య, షాహింతాజ్ దంపతుల 30వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అవసరమైన వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు కంటి చూపు సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందని బాబయ్య దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి, ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహన్ రెడ్డి, పుటక శంకర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, వృద్ధులు, భక్తులు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకుంటూ వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సేవా కార్యక్రమానికి సహకరించిన దాతలను నిర్వాహకులు అభినందించారు.

ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని.
ఆర్డీవో నాగ ప్రసన్నలక్ష్మి



మడకశిర సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంకాలం ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డిఓ నాగ ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారుల తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో నాగప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మండలములోనూ వినాయక చవితి కార్యక్రమాలు జరపడం జరుగుతోందని అయితే ఆ కార్యక్రమం ప్రశాంతంగా జరుపుకోవడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు పూజారి ముకుందా, చంద్రశేఖర్, సీఐ రాజకుమార్, ఎంపీడీవోలు, అగ్నిమాపక అధికారి, విద్యుత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పెన్షన్లకు ఇంటి గుత్తలతో ముడి పెట్టొద్దు

-- డప్పు,చర్మ కళాకారులు, చేనేత కార్మికులకు సెల్ఫ్ డిక్లరేషన్ తో అర్హతలు ఇవ్వాలి

-- దరఖాస్తు గడువును 45 రోజులకు పెంచాలని వినతి



సోమందేపల్లి సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంకాలం పెన్షన్ దరఖాస్తుకు కనీసం 45 రోజులు గడువు పెంచాలని దరఖాస్తుల నిబంధనలు సడలించాలని చేనేత డప్పు చర్మకళా కారులకు సెల్ఫ్ డిక్లరేషన్తో అర్హులుగా గుర్తించాలని. సిపిఎం, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు అధ్యక్షతన తహసిల్దార్ మారుతి ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల తర్వాత పెన్షన్ దరఖాస్తుకు అవకాశం ఇచ్చింది. దరఖాస్తుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు వివిధ రకాల పెన్షన్ దరఖాస్తుదారులకు తీవ్రమైన నష్టం కలిగించే విధంగా ఉన్నాయి. అందులో ముఖ్యంగా వృద్ధాప్య పెన్షన్లకు ఇంటి గుత్తలు, చేనేత, డప్పు, చర్మ కళాకారులకు సంబంధిత ప్రభుత్వ జిల్లా శాఖల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అడగడం వలన ఎక్కువ మంది అర్హతలు కోల్పోవలసి వస్తుందన్నారు. దీనికి తోడు దరఖాస్తు గడువు సమయం కేవలం 9 రోజులు విధించడం వల్ల దరఖాస్తుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం సాధ్యం కానిదని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు ఎన్నికల మేనిఫెస్టోలో 50 సంవత్సరాలు అని చెప్పి దరఖాస్తుకు మాత్రం 60 సంవత్సరాల విధించడం పెన్షన్ దారులను మోసం చేయడమేనని తెలిపారు.పెన్షన్ దరఖాస్తులకు గడువు సమయం సుమారు 45 రోజుల పెంచి నిబంధనలను సడలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కొండా వెంకటేశులు లక్ష్మీనారాయణ నాగభూషణ రామకృష్ణ స్థానికులు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది భాస్కర్ తల్లి మృతి పట్ల సంతాపం

మడకశిర సెప్టెంబర్ 8 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది భాస్కర్ తల్లి శాంతమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గుడ్డంపల్లి గ్రామానికి వెళ్లి శాంతమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సీనియర్ టిడిపి నాయకుడు పుల్లయ్య చౌదరి, అడ్వకేట్ పుట్టకామప్ప, కాంట్రాక్టర్ లక్ష్మీనరసప్ప, రాజశేఖర్, ఎల్ఐసి ఏజెంట్ హనుమంతరాయుడు, డీలర్ నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881